శుక్రవారం 14-6-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 364, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com

# ఉగ్ర ఘటనలపై మోడీ సమీక్ష

- జమ్మూకశ్మీర్ భద్రత పరిస్థితులపై వివరణ
- రంగంలోకి దిగాలని ప్రధాని ఆదేశించినట్లు సమాచారం



**ముందడుగు జాతీయం:**

దేశంలో ఇటీవల నాలుగు రోజుల వ్యవధిలో నాలుగు ఉగ్ర దాడులు జరిగాయి. ఈ క్రమంలోనే జమ్మూకశ్మీర్‌లోని భద్రత పరిస్థితులను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గురువారం సమీక్షించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోభాల్, జమ్మూకశ్మీర్ ఎల్జీ మనోజ్‌సిన్హాలతో మాట్లాడారు. స్థానికంగా భద్రత పరిస్థితులు, ఉగ్ర వ్యతిరేక కార్యకలాపాల గురించి వారు ప్రధానికి వివరించారు. ఈ క్రమంలోనే ఉగ్ర నిరోధక సామర్థ్యాలను పూర్తిస్థాయిలో రంగంలోకి దించాలని ప్రధాని ఆదేశించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. యాత్రికులే లక్ష్యంగా ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని పర్యటక బస్సుపై ఉగ్రవాదులు జరిపిన దాడిలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయిన విషయం మిగతా 2లో



# 1563 మంది అభ్యర్థులకు మళ్లీ పరీక్ష

- గ్రేస్ మార్కులు తొలగిస్తామని తెలిపిన కేంద్రం
- సుప్రీంకోర్టుకు వివరాలు వెల్లడించిన కేంద్రం

**ముందడుగు జాతీయం:**

జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్) యూజీ 2024లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తిన వేళ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. నీట్ ఫలితాల్లో 1500 మందికి పైగా అభ్యర్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కులను తొలగిస్తామని సుప్రీంకోర్టుకు తెలియజేసింది. వారికి మళ్లీ పరీక్ష రాసే అవకాశం కల్పిస్తామని చెప్పింది. ఈ ఏడాది జరిగిన నీట్ పరీక్షలో 1563 మంది విద్యార్థులకు అదనంగా గ్రేస్ మార్కులు ఇచ్చారు. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లో మార్పులు, పరీక్ష కేంద్రాల మిగతా 2లో



## ఐస్‌క్రీమ్‌లో ఏకంగా మనిషి వేలు

వివరాలు 3లో



## ఆగ్రహంతో కాలుతో తొక్కి చంపిన ఏనుగు

వివరాలు 3లో



## ఒంటరి మహిళకు టికెట్ లేకపోయినా ఓకే

వివరాలు 4లో



## జీవితానికి తోడు అవసరమా?

వివరాలు 5లో

# ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు

- మెగా డీఎస్సీ ఫైలుపై మొదటి సంతకం
- మరో నాలుగు ఫైళ్లపై సంతకాలు

**ముందడుగు విజయవాడ:**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించారు. భారీ కాన్వాయ్ తో వెలగపూడిలోని సచివాలయానికి సతీమణితో వచ్చిన చంద్రబాబు సరిగ్గా సాయంత్రం 4.41నిమిషాలకు సీఎం కుర్చిలో కూర్చొని బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిందే తడవుగా మొదటిగా మెగా డీఎస్సీ ఫైలుపై సంతకం చేశారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించేందుకు వస్తున్న చంద్రబాబుకు రాజధాని



ప్రాంత ప్రజలు, రైతులు ఘనస్వాగతం పలికారు. దారి పొడవున పూలుజల్లి సీఎంపై తమ మిగతా 2లో

## సన్నీ లియోన్ ప్రదర్శనకు అనుమతి లేదు

కేరళ యూనివర్సిటీ ఆదేశం

వివరాలు 2లో

# తెలంగాణలో మహిళా శక్తి క్యాంటీన్లు

- ఆర్థికంగా మహిళ సంఘాల బలోపేతానికి కృషి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడి

**ముందడుగు తెలంగాణ:**



తెలంగాణ రాష్ట్రంలో మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడించారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం మిగతా 2లో

ముందడుగు
శుక్రవారం, 14-6-2024, హైదరాబాద్

## ఉగ్ర ఘటనలపై మోడీ సమీక్ష

మొదటిపేజీ తరువాయి

తెలిసిందే. మంగళవారం సాయంత్రం కరువా జిల్లాలోని హీరానగర్ సెక్టార్‌లో ఒక ఇంటిపై దాడి జరిగింది. ఈ క్రమంలోనే భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఒక సీఆర్‌పీఎఫ్ జవాన్ అమరుడైనట్లు అధికారులు తెలిపారు. దోడా జిల్లాలోని భదర్వాపఠాన్‌కోట్ రహదారి సమీపంలోని ఒక చెక్‌పోస్టుపై మంగళవారం జరిగిన దాడిలో.. రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన ఐదుగురు సిబ్బంది, ఒక పోలీసు అధికారి గాయపడ్డారు. ఇదే జిల్లాలోని మరో ఘటనలో ఒక పోలీసు అధికారి గాయాలపాలయ్యారు. జమ్మూకశ్మీర్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు పాకిస్థాన్ కుయుక్తులు పన్నుతోందని డీజీపీ ఆర్‌ఆర్ స్వైన్ ఆరోపించారు. శత్రుమూకలకు బుద్ధి చెప్పేందుకు బలగాలు సంసిద్ధంగా ఉన్నాయని స్పష్టంచేశారు.

## తెలంగాణలో మహిళా శక్తి క్యాంటీన్లు

మొదటిపేజీ తరువాయి

చేయాలన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 150 మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామైక్య సంఘాలకు వీటి నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు. కలెక్టరేట్లు, దేవాలయాలు, బస్టాండ్లు, పారిశ్రామిక, పర్యాటక ప్రాంతాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. బెంగాల్‌లోని దీదీ కా రసోయ్, కేరళలోని క్యాంటీన్లపై ఇప్పటికే అధ్యయనం చేసినట్లు సీఎస్ వివరించారు. వీటి నిర్వహణపై మహిళా సంఘాలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ మేరకు వివిధ శాఖల అధికారులతో సీఎస్ సమీక్ష నిర్వహించారు. మహిళ శక్తి క్యాంటీన్ల పనితీరు, నిర్వహణ, అవసరమైన స్థలం తదితర వివరాలతో రోడ్ మ్యాప్ తయారు చేయాలని గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ శాఖ కమిషనర్‌ను సీఎస్ ఆదేశించారు.

## 1563 మంది అభ్యర్థులకు మళ్లీ పరీక్ష

మొదటిపేజీ తరువాయి

వద్ద సమయం కోల్పోవడంతో వీటిని కలిపారు. అయితే దీనిపై అభ్యంతరాలు వ్యక్తమవడంతో పాటు నీట్ పరీక్షలో అక్రమాలపై ఆరోపణలు రావడంతో గతవారం కేంద్ర విద్యాశాఖ నలుగురు సభ్యులతో కమిటీ వేసింది. కోల్పోయిన సమయానికి పరిహారంగా గ్రేస్ మార్కులు పొందిన 1563 విద్యార్థులపై ఈ కమిటీ విచారణ జరిపి నివేదిక సమర్పించింది.

కమిటీ నిర్ణయాలను కేంద్రం గురువారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ''కోల్పోయిన సమయానికి పరిహారంగా గ్రేస్ మార్కులు పొందిన ఆ 1563 మంది విద్యార్థుల స్కోర్ కార్డులను రద్దు చేయాలని కమిటీ నిర్ణయించింది. వారికి మళ్లీ పరీక్ష రాసేందుకు అవకాశం కల్పిస్తాం. జూన్ 23న పరీక్ష నిర్వహించి ఈ నెల 30వ తేదీలోగా వారి ఫలితాలను ప్రకటిస్తాం'' అని ధర్మాసనానికి కేంద్రం వెల్లడించింది. ఆ తర్వాతే కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపింది. ఒకవేళ మళ్లీ పరీక్ష రాయొద్దని అనుకునే వారు.. గ్రేస్ మార్కులు లేకుండా ఒరిజినల్ మార్కులతో కౌన్సెలింగ్‌కు వెళ్లొచ్చని పేర్కొంది.

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరిపింది. వెబ్ కౌన్సెలింగ్‌పై స్టే ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. కౌన్సెలింగ్ యథాతథంగా ఉంటుందని చెప్పిన ధర్మాసనం.. ఈ పిటిషన్లపై రెండు వారాల్లోగానే సమాధానం చెప్పాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి నోటీసులు జారీ చేసింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను జులై 8వ తేదీకి వాయిదా వేసింది. జులై 6వ తేదీ నుంచి నీట్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది.

## సన్నీ లియోన్ ప్రదర్శనకు అనుమతి లేదు

### కేరళ యూనివర్సిటీ ఆదేశం

**ముందడుగు కేరళ:**




కేరళ యూనివర్సిటీలో ప్రముఖ నటి సన్నీ లియోన్ తలపెట్టిన ఓ ప్రదర్శనకు అనుమతి నిరాకరించింది. ఈ ఈవెంట్‌కు అనుమతి ఇవ్వకూడదని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. గతంలో చోటు చేసుకున్న విషాద సంఘటనలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తిరువనంతపురంలోని యూనివర్సిటీ క్యాంపస్‌లో జులై 5న ఈ ప్రదర్శన నిర్వహించాలని భావించారు.

గతేడాది ఎర్నాకుళం జిల్లాలోని కొచ్చిన్ యూనివర్సిటీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో సన్నీ లియోన్ పాల్గొన్నారు. ఆ సందర్భంగా అక్కడ తొక్కిసలాట జరిగింది. ఆ ఘటనలో నలుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మరో 60 మందికి గాయాలయ్యాయి. ఆ ఘటనను కేరళ హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. అది పూర్తిగా నిర్వహణ వైఫల్యమేనని, అటువంటివి పునరావృతం కాకూడదని ఆదేశించింది. పలు భారతీయ భాషాచిత్రాల్లో నటిస్తోన్న సన్నీ లియోన్.. మలయాళ సినిమాల్లోనూ అడుగు పెట్టనున్నారు. ఇందులో భాగంగా ఓ ప్రాజెక్టు ముహూర్తానికి సంబంధించిన విషయాన్ని సోషల్ మీడియాలో ఇటీవల వెల్లడించారు. బాలీవుడ్‌లో పలు చిత్రాలు చేసిన సన్నీ.. తెలుగులోనూ నటించిన సంగతి తెలిసిందే.

## రాజకీయాల కంటే నటి జీవితమే బెటర్

### ఎంపీ, నటి కంగనా రనౌత్ ఆసక్తికర వ్యాఖ్యలు

**ముందడుగు జాతీయం:**



రాజకీయాల్లో రాణించడం ఎంతో కష్టమని, దీంతో పోలిస్తే ఓ నటిగా హాయిగా జీవించవచ్చని ఎంపీగా గెలిచిన బాలీవుడ్ ప్రముఖ నటి కంగనా రనౌత్.. సినీ, రాజకీయ జీవితాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సవాళ్లతో కూడుకున్న రాజకీయాల్లోకి రావడానికి గల కారణాలను కంగనా వివరించారు. ''మా ముత్తాత గతంలో ఎమ్మెల్యేగా పని చేశారు. చాలాకాలంగా రాజకీయాల్లో చేరాలని మా నాన్న, సోదరికి ఆఫర్లు వచ్చాయి. నా తొలి చిత్రం గ్యాంగ్‌స్టర్ తర్వాత రాజకీయాల్లోకి రావాలని ఎన్నోసార్లు సంప్రదించారు. కానీ, అందుకు సరైన సమయం రావాలని ఎదురుచూశా. నిజానికి రాజకీయాలతో పోలిస్తే.. నటులు అంతగా కష్టాలు లేని జీవితాన్ని గడుపుతారు. సెట్స్‌కి వెళ్లి రిలాక్స్ అవుతూ.. ఒత్తిడి లేని జీవితాన్ని గడుపుతాం. కానీ, ఎంతోమంది రకరకాల సమస్యలతో నాయకుల ముందుకు వస్తుంటారు. వాటిని జాగ్రత్తగా పరిష్కరించాల్సి ఉంటుంది'' అని ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కంగనా రనౌత్ తన అభిప్రాయాలను పంచుకున్నారు.

''ఓసారి నా గురువు సద్గురు జగ్గీ వాసుదేవ్ జీవిత సూక్తులను బోధించారు. 'తెలివైనవారు తమకు నచ్చిన పనిని మాత్రమే చేస్తారు. కానీ, అవసరమైన పనిని చేసినవారే మేధావులు అవుతారు' అని అన్నారు. అందుకే గురూజీ చూపిన మార్గాన్ని ఎంచుకున్నా. రాజకీయాలపై ఆసక్తి లేకుంటే.. ఇన్ని కష్టాలను భరించాల్సిన అవసరం ఉండకపోయేది'' అని కంగనా పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చిలో రాజకీయాల్లోకి అరంగేట్రం చేసిన కంగనా.. భాజపా తరఫున హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలోకి దిగారు. 74 వేలకు పైగా ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి విక్రమాదిత్యసింగ్‌పై విజయం సాధించిన సంగతి తెలిసిందే.

## ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు

మొదటిపేజీ తరువాయి

ఆదరాభిమానాలు చూపించారు.

### ఆ ఐదు ఫైళ్లపై సంతకం..

ప్రజలు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలనే కృతనిశ్చయంతో ఏపీ ప్రభుత్వం ఉంది. కొత్తగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సీఎం నారాచంద్రబాబునాయుడు ముందుగా పెట్టుకున్న ముహూర్తం ప్రకారం గురువారం సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఐదు ఫైళ్లపై సంతకం చేశారు.ఇందులో ప్రధానమైనది మెగా డీఎస్సీ ఫైలుపై సంతకం చేస్తారు. అలాగే వైసీపీ సర్కారు తెచ్చిన ల్యాండ్ యాక్ట్ ను రద్దు చేస్తూ రెండో ఫైలుపై సంతకం చేస్తారు. వీటితో పాటు 4వేల రూపాయలకు పించన్ పెంపు, అన్న క్యాంటిన్ పునరుద్ధీరణ, స్కిల్ సెన్సెక్స్ పై సంతకాలు చేసి పరిపాలన ముద్ర వేయనున్నారు.

### చంద్రబాబు సంతకం చేసిన 5ఫైల్స్ ఇవే..

1.తొలి సంతకం మెగా డీఎస్సీ ..!
2.రెండో సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు.
.మూడో సంతకం 4వేల రూపాయలకు పించన్ పెంపు.
4.నాల్గవ సంతకం అన్న క్యాంటిన్ పునరుద్ధీరణ.
5.ఐదవ సంతకం స్కిల్ సెన్సెక్స్

ప్రజలకు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకూడదని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకే తమ ప్రభుత్వం పరిపాలన భాద్యతలు స్వీకరించగానే ప్రజలకు అవసరమైన, ఆమోదయోగ్యమైన పనులకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. అందుకే గతంలో టీడీపీ పాలనలో చేపట్టిన అన్న క్యాంటిన్ల ప్రారంభంతో పాటు పెంచిన ఫించన్ ను అందజేసేందుకు సముఖంగా ఉన్నట్లుగా తెలుస్తోంది.



ముందడుగు

శుక్రవారం,
14-6-2024,
హైదరాబాద్

# ఐస్‌క్రీమ్‌లో ఏకంగా మనిషి వేలు

## ముంబయిలో డాక్టర్‌కు జరిగిన సంఘటన

**ముందడుగు ముంబాయి:**

ఐస్ క్రీం అంటే ఇష్ట పడని వారుండరు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ చాలా ఇష్టంగా తింటారు. కానీ ఐస్ క్రీంను ఎలా తయారు చేస్తారో అనే అందోళన చాలా మందిలో ఉంటుంది. గతంలో ఐస్‌క్రీమ్‌ల్లో పురుగులు కన్పించిన ఘటనలు చూశాం. కానీ, ఇప్పుడు మానవ అవయవాలు కూడా వస్తున్నాయి. ముంబయిలోని ఓ డాక్టర్ కొనుగోలు చేసిన ఐస్‌క్రీమ్‌లో ఏకంగా మనిషి వేలు వచ్చింది.



ముంబయికి చెందిన యువ డాక్టర్ ఓర్లెమ్ బ్రెండన్ సెర్రావో తన సోదరితో కలిసి బుధవారం ఆన్‌లైన్ డెలివరీ యాప్‌లో మూడు ఐస్‌క్రీమ్‌లు ఆర్డర్ పెట్టాడు. వారు కొనుగోలు చేసిన 'ది యుమ్మో బటర్‌స్కాచ్' ఫ్లేవర్ కోన్ ఐస్‌క్రీమ్‌లను ఆ సంస్థ డెలివరీ చేసింది. అతడు దానిని తినడం మొదలుపెట్టాక.. నాలుకకు ఏదో గట్టిగా తగలడం మొదలైంది. దీంతో అనుమానం వచ్చి దానిని పరీక్షగా చూడగా.. 2 అంగుళాల మనిషి వేలు కన్పించింది. అతడు స్వయంగా డాక్టర్ కావడంతో వెంటనే దానిని ధ్రువీకరించుకోగలిగాడు. ఒక్కసారిగా అతడు దిగ్భ్రాంతికి గురయ్యాడు.

ఆ తర్వాత అతడు తేరుకొని మలాడ్‌లోని పోలీస్ స్టేషన్‌లో ఈ విషయంపై ఫిర్యాదు చేశాడు. అధికారులు కూడా వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసుకొన్నారు. దీనిపై పోలీసు సిబ్బంది మాట్లాడుతూ ఆ వేలును ఫోరెన్సిక్ పరీక్షలకు పంపినట్లు వెల్లడించారు. ఇక ఆ ఐస్‌క్రీం తయారు చేసిన సంస్థ ప్రాంగణంలో కూడా తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ విషయాన్ని తాము తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు ఆ ఐస్‌క్రీమ్ తయారీ సంస్థ ఇప్పటి వరకు ఈ ఘటనపై స్పందించలేదు.

# ఆ రాష్ట్ర చరిత్రలో తొలి మహిళ మంత్రి

## మాజీ ముఖ్యమంత్రి సతీమణికి అవకాశం

**ముందడుగు అరుణాచల్ ప్రదేశ్:**

అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఒక మహిళ మంత్రి బాధ్యతలు స్వీకరించారు. ఆమె దొసాంగ్లు పుల్. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో హాయులియాంగ్ నియోజకవర్గం నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ ముఖ్యమంత్రి కలిఖో పుల్ సతీమణి అయిన ఆమెను మద్దతుదారులు ఐరన్ లేడీ అని పిలుస్తుంటారు. భర్త మరణానంతరం ఆయన ప్రాతినిధ్యం వహించిన ఆ స్థానంలో 2016 నుంచి ఎన్నికవుతున్నారు. అయితే ప్రస్తుత క్యాబినెట్‌లో ఆమెకు ఏ శాఖ అప్పగిస్తారో తెలియాల్సిఉంది.



మాజీ సీఎం దోర్జీ ఖండూ కుమారుడు పెమా ఖండూ. పెమా 2000లో కాంగ్రెస్‌లో చేరారు. తండ్రి మరణం తర్వాత రాజకీయాల్లో పెమా వేగంగా ఎదిగారు. నబమ్ తుకి ప్రభుత్వం (కాంగ్రెస్)లో మంత్రిగా పనిచేశారు. 2016లో అరుణాచల్‌లో రాజ్యాంగ సంక్షోభం తలెత్తింది. రాష్ట్రపతి పాలనను ఎత్తివేశాక భాజపా మద్దతుతో ఏర్పాటైన కలిఖో పుల్ సర్కారులో పెమా మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. తర్వాత పీపీఏలో చేరిన ఆయన.. ఆ వెంటనే తన మద్దతుదారులతో కలిసి భాజపాలో చేరారు. తాజా ఎన్నికల్లో 60 స్థానాలకు గానూ 46 సీట్లను గెల్చుకొని వరుసగా మూడోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి భాజపా అగ్రనేతలు అమిత్ షా, జేపీ నడ్డా, కిరణ్ రిజిజు వంటి వారు హాజరయ్యారు.


### ఏనుగుతో రీల్ చేసేందుకు ప్రయత్నం

# ఆగ్రహంతో కాలుతో తొక్కి చంపిన ఏనుగు

## అక్కడికక్కడే మరణించిన యువకుడు

**ముందడుగు ఉత్తరప్రదేశ్:**

ఒక వ్యక్తి ఏనుగుతో రీల్ చేసేందుకు దానిని భయపెట్టి తరిమే ప్రయత్నం చేసాడు. ఆగ్రహించిన ఏనుగు ఆ వ్యక్తి వెంటపడింది. తొండంతో విసిరి కొట్టడంతోపాటు కాలుతో తొక్కి చంపింది. ఉత్తరప్రదేశ్‌లోని బిజ్నోర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అడవి నుంచి బయటపడిన ఒక ఏనుగు ఆ జిల్లాలోని పలు గ్రామాల్లో సంచరించింది. గురువారం ఉదయం హబీబావాలా గ్రామానికి చేరింది. ఏనుగును చూసేందుకు గ్రామస్తులు గుమిగూడారు. బాగ్దాద్ అన్సార్ గ్రామానికి చెందిన 30 ఏళ్ల ముర్సాలీన్ ఆ ఏనుగుతో రీల్ చేసేందుకు ప్రయత్నించాడు. భయపెట్టి తరిమేందుకు దాని సమీపానికి వెళ్లాడు. ఆగ్రహించిన ఏనుగు అతడి వెంటపడింది.



దీంతో ఆ వ్యక్తితోపాటు అక్కడున్న జనం భయంతో పరుగులు తీశారు. అయితే ముర్సాలీన్‌ను సమీపించిన ఏనుగు కాళ్లతో అతడ్ని తొక్కింది. తొండంతో 25 అడుగుల ఎత్తుకు విసిరికొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడ్ని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. మరోవైపు ఈ సంఘటనతో గ్రామస్తులు భయాందోళన చెందారు. ఏనుగు సంచారం గురించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఆ గ్రామానికి చేరుకున్నారు. ఏనుగును తిరిగి అడవిలోకి పంపేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా, ఏనుగు దాడి నుంచి తప్పించుకునేందుకు ముర్సాలీన్, రీల్ రికార్డు చేసే వ్యక్తి, ఇతరులు పరుగు తీసిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# కూరగాయల ధరలకు రెక్కలు

## ఆకాశాన్నంటిని టమాటా, ఉల్లి ధరలు

**ముందడుగు తెలంగాణ:**

రాష్ట్రంలో ఒక్కసారిగా కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. అరకొర సంపాదనతో బతుకు బండి లాగుతున్న సామాన్యులు కూరగాయలు కొనలేని పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్ నగరంలో టమాటా, ఉల్లి ధరలు మళ్లీ ఆకాశాన్నంటాయి. వంటకు ప్రధానమైన టమాటా, ఉల్లి ధరలు పెరగడంతో.. గృహిణులు ఆందోళనకు గురవుతున్నారు. గత నాలుగైదు రోజుల నుంచి ఉల్లి ధరలు భారీగా పెరిగాయి. టమాటా ఉన్నట్టుండి నిన్నటి నుంచి భారీ ధర పలుకుతోంది.



నాణ్యమైన మొదటి రకం టమాటా కిలో రూ. 80 నుంచి రూ. 90 పలుకుతోంది. సెకండ్ క్వాలిటీ టమాటా కిలో ధర రూ. 60 నుంచి 70 ఉంది. ఇక హోల్ సేల్ మార్కెట్లలో రూ. 120కి మూడు కిలోల టమామా విక్రయిస్తున్నారు. ఇక కేజీ ఉల్లిపాయ ధర రూ. 50పైనే పలుకుతోంది. కొన్ని ప్రాంతాల్లో రూ. 60కి విక్రయిస్తున్నారు. టమాటా, ఉల్లిపాయ ధరలు పెరగడంతో సామాన్యులు కూరగాయలు కొనాలంటేనే భయపడిపోతున్నారు.



# ఓయూ నుంచి డాక్టరేట్ పొందిన మంజుల

**ముందడుగు హైదరాబాద్:**

హైదరాబాదులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుస్సేనీ ఆలం, అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న పి మంజుల, కామర్స్ విభాగాధిపతి "హైదరాబాద్ యందు మహిళా ఉపాధ్యాయుల యొక్క పెట్టుబడి అలవాట్లు " అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటి, డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ , సీనియర్ ప్రొఫెసర్ వి. అప్పారావు పర్యవేక్షణలో అధ్యయనం చేశారు. ఈ అధ్యయనంపై ఉస్మానియా విశ్వ విద్యాలయము నుండి మే 2024 న డాక్టరేట్ పట్టా పొందారు

ముందడుగు
శుక్రవారం, 14-6-2024, హైదరాబాద్

## 13 రాష్ట్రాల గుండా ప్రయాణించే రైలు

- ఈ రైలు 4 రోజుల పాటు ప్రయాణిస్తోంది
- దేశంలో అత్యంత ప్రసిద్ధ సుదూర రైలు



**ముందడుగు జాతీయం:**

భారతీయ రైల్వే ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద రైల్వే సంస్థగా పేరుగాంచాయి. దేశంలో మొత్తం 28 రాష్ట్రాలను కలుపుతూ రైలు సర్వీసులు జరుగుతున్నాయి. ప్రజలు ప్రయాణించడానికి రైల్వేనే ఉపయోగిస్తారు. భారతీయ రైల్వేలు దేశంలోని అన్ని ప్రాంతాలను రైలు ద్వారా అనుసంధానించడానికి విస్తారమైన మౌలిక సదుపాయాలను కలిగి ఉన్నాయి.

ఈ సందర్భంలో, భారతీయ రైల్వేలోని 13 రాష్ట్రాల గుండా ప్రయాణించే రైలును నిర్వహిస్తారు. దేశంలోని సగం రాష్ట్రాల గుండా వెళ్లే ఈ రైలు ప్రయాణిస్తుంది. కర్ణాటక నుంచి జమ్మూ వెళ్లే నవ్యక్ ఎక్స్‌ప్రెస్ కర్ణాటకలోని మంగళూరు నుండి జమ్ముతావి వరకు నడుస్తుంది.

కర్ణాటక మంగళూరు నుండి పుట్టిన ఈ రైలు కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ, హర్యానా, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ మీదుగా జమ్మూ కాశ్మీర్ చేరుకుంటుంది. నవ్యక్ ఎక్స్‌ప్రెస్‌కు 12 రాష్ట్రాల్లో మాత్రమే స్టాప్‌లు ఉన్నాయి. ఇది కేవలం హిమాచల్ ప్రదేశ్‌లోనే ఆగదు. ఈ రైలు 4 రోజుల పాటు నిరంతరం ప్రయాణిస్తుంది మరియు మొత్తం 13 రాష్ట్రాలను దాటడానికి 68 గంటల 20 నిమిషాలు పడుతుంది. నవ్యక్ ఎక్స్‌ప్రెస్ భారతదేశంలో అత్యంత ప్రసిద్ధ సుదూర రైలు.

## ఒంటరి మహిళకు టికెట్ లేకపోయినా ఓకే

### రైలు నుంచి దిగమని బలవంతం చేయొద్దు ▪ రైల్వే శాఖలో కొన్ని నిబంధనలు

***భారత రైల్వేశాఖ ఒంటరిగా ప్రయాణించే మహిళల కోసం ప్రత్యేక రక్షణ చట్టాలు అమలు చేస్తోంది. ప్రస్తుతం ఈ చట్టాలపై చాలా మందికి అవగాహన లేదు. ఈ పరిస్థితిని మార్చాల్సిన అవసరం ఉంది. అందుకే ప్రజలకు పెద్దగా తెలియని, ముఖ్యమైన రైల్వే రూల్స్ తెలుసుకుందాం.***

**ముందడుగు ప్రత్యేకం**

1989లో రూపొందించిన, భారతీయ రైల్వే చట్టంలోని సెక్షన్ 139.. ఒంటరి మహిళా ప్రయాణీకులకు, ముఖ్యంగా పిల్లలతో ప్రయాణించే వారికి రక్షణ కల్పిస్తుంది. ఈ చట్టం ప్రకారం, ఒక మహిళ తన బిడ్డతో ఒంటరిగా ప్రయాణిస్తుంటే, టిక్కెట్ లేదా పాస్ లేకపోతే, ఆమెను రాత్రిపూట రైలు నుంచి దిగేయమని బలవంతం చేయకూడదు. రైలు ప్రయాణాల సమయంలో మహిళా ప్రయాణికులు, వారి పిల్లల భద్రత, శ్రేయస్సు కోసం ఈ నిబంధన తీసుకొచ్చారు.



**టికెట్ లేకపోయినా ఓకే**

ఒంటరిగా ప్రయాణాలు చేసే టీనేజ్ అమ్మాయి లేదా మహిళకు టిక్కెట్ లేకపోతే, ఆమెను రైలు నుంచి దింపేసే అధికారం టీటీఈకి లేదని భారతీయ రైల్వే స్పష్టంగా పేర్కొంది. వారి వద్ద డబ్బు ఉంటే, ఫైన్ కట్టి ప్రయాణం కొనసాగించవచ్చు. మహిళ లేదా టీనేజ్ అమ్మాయి దగ్గర డబ్బు లేని సందర్భాల్లో, టీటీఈ వారిని కంపార్ట్‌మెంట్ నుంచి దించేయకూడదు.

**మహిళల భద్రత కోసం నిబంధనలు**

మహిళల కోసం లాంగ్ డిస్టెన్స్ మెయిల్/ఎక్స్‌ప్రెస్ ట్రైన్స్ స్లీపర్ క్లాస్‌లో ఆరు బెర్తులు రిజర్వ్ చేశారు. అలాగే గరీబ్ రథ్/రాజధాని/దురంతో/పుల్లీ ఎయిర్ కండిషన్డ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని థర్డ్ టైర్ AC (3AC) కోచ్‌లలో ఆరు బెర్తులను మహిళా ప్రయాణికుల కోసం రిజర్వ్ చేశారు. మహిళల వయస్సుతో సంబంధం లేకుండా అలానే ఒంటరిగా లేదా గ్రూపుగా ప్రయాణిస్తున్నారా అనే అంశాలతో సంబంధం లేకుండా ఈ రిజర్వేషన్లు వర్తిస్తాయి. భారతీయ రైల్వే చట్టం 1989లోని సెక్షన్ 311 ప్రకారం సైనిక సిబ్బంది మహిళల కంపార్ట్‌మెంట్లలోకి ప్రవేశించేందుకు అనుమతి లేదు. అధికారులతో పాటు ఒక మహిళా కానిస్టేబుల్ ఉన్నప్పుడు మాత్రమే ఒక మహిళను రైలు నుంచి బయటకు వెళ్లమని కోరవచ్చు. సెక్షన్ 162 ప్రకారం, 12 ఏళ్లలోపు బాలురు మహిళల కంపార్ట్‌మెంట్లలో ప్రయాణించవచ్చు. మహిళా కోచ్‌లోకి ప్రవేశించే పురుషుడు ఎవరైనా చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి రావచ్చు. రైళ్లలో ప్రయాణించే మహిళా ప్రయాణికుల భద్రత కోసం రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. 2020 అక్టోబర్ 17న 'మేరీ సహేలి' అనే పాన్ ఇండియా కార్యక్రమాన్ని ఆర్పీఎఫ్ ప్రారంభించింది. మహిళా ప్రయాణీకులకు, ప్రత్యేకించి ఒంటరిగా ప్రయాణించే వారికి భద్రత కల్పించడం ఈ ఇనిషియేటివ్ ప్రధాన లక్ష్యం. భారతీయ రైల్వే స్టేషన్లలో సిసిటివిలు, మానిటరింగ్ రూమ్‌లను ఏర్పాటు చేయడం ద్వారా మహిళల భద్రతను మెరుగుపరిచారు.

## సత్యసాయి విద్యావిహార్‌లో విద్యార్థుల సందడి

### చిన్నారులకు స్వాగతం పలికిన ప్రిన్సిపాల్ పద్మజ







**ముందడుగు హైదరాబాద్:**

నూతన విద్యాసంవత్సరాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ డీడీ కాలనీలోని సత్యసాయి విద్యావిహార్ హైస్కూల్ లో గురువారం ఫస్ట్ క్లాస్ విద్యార్థులకు వెల్ కమ్ పార్టీ ఘనంగా నిర్వహించారు. చిన్నారుల ఆటపాటలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ చిన్నారులకు స్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తూ, చదువుతో పాటు మంచి సంస్కారాన్ని అందించే విద్యావిధానాన్ని అందిస్తున్నామని వారు అన్నారు. సీనియర్ విద్యార్థులు ఆటపాటలతో చిన్నారులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## బుల్లెట్ శబ్దాలతో నిద్రలేచా..

### కాల్పుల ఘటనపై పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో సల్మాన్ ఖాన్



బాలీవుడ్ స్టార్ నటుడు సల్మాన్ ఖాన్ ఇంటి వద్ద ఇటీవలే కాల్పుల ఘటన కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు దర్యాప్తును ముమ్మరంగా సాగిస్తున్నారు. ఇందులో భాగంగా కాల్పుల ఘటనపై సల్మాన్ ఖాన్, అతడి సోదరుడు అర్బాజ్ ఖాన్ వాంగ్మూలాలను తీసుకున్నట్లు ఓ అధికారి పీటీఐకి తెలిపారు. ఘటన జరిగిన రోజు ఇంట్లోనే ఉన్నట్లు సల్మాన్ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో తెలిపారు. రాత్రి పార్టీ కారణంగా ఆలస్యంగా పడుకున్నాని.. తెల్లవారుజామున బుల్లెట్ శబ్దాలతో నిద్రలేచినట్లు సల్మాన్ పోలీసులకు వెల్లడించారు.

నలుగురు సభ్యుల క్రైమ్ బ్రాంచ్ బృందం (Mumbai Crime Branch Team) జూన్ 4న సల్మాన్ నివాసం ఉండే బాంద్రాలోని గెలాక్సీ అపార్ట్‌మెంట్‌ను సందర్శించినట్లు అధికారి తెలిపారు. నటుడితోపాటు అతడి సోదరుడి స్టేట్‌మెంట్ రికార్డ్ చేసుకున్నట్లు చెప్పారు. సల్మాన్ వాంగ్మూలాన్ని దాదాపు నాలుగు గంటల పాటు నమోదు చేయగా.. అతని సోదరుడి స్టేట్‌మెంట్‌ను రెండు గంటలకుపైగా రికార్డ్ చేసినట్లు అధికారి తెలిపారు. ఈ సందర్భంగా క్రైమ్ బ్రాంచ్ అధికారులు వారిని దాదాపుగా 150 ప్రశ్నలు అడిగినట్లు సదరు అధికారి వెల్లడించారు.

ముందడుగు
శుక్రవారం, 14-6-2024, హైదరాబాద్



# జీవితానికి తోడు అవసరమా?


దక్షిణాదిలోని అన్ని భాషల్లోనూ సినిమాలు చేసి మంచి గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక మమతామోహన్‌దాస్. ఆమె మంచి గాయని కూడా కావడం విశేషం. కొన్నాళ్ల క్రితం అనారోగ్యం కారణంగా సినిమాలకు దూరమైన మమతా.. మళ్లీ తన మాతృభాష మలయాళంలో బిజీ అయ్యింది. తమిళంలో విజయ్‌సేతుపతితో కలిసి ఆమె నటించిన చిత్రం 'మహారాజా'గా తెలుగులో విడుదల కానుంది. ఇలా వరుసగా అవకాశాలు అందుకుంటూ, పూర్వవైభవాన్ని దక్కించుకుంటున్నది మమతామోహన్‌దాస్. ఇదిలావుంటే.. 39ఏళ్ల ఈ అందాలభామ ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ప్రేమ, పెళ్లి, డేటింగ్ గురించి ఆసక్తికరంగా మాట్లాడింది. 'లాస్ ఏంజెల్స్ ఉన్నప్పుడు ఒకరిని ఇష్టపడ్డాను. కానీ ఆ బంధం ఎక్కువకాలం కొనసాగలేదు. ఒత్తిడితో కూడిన బంధాలు నిలవవు. బంధం బలంగా ఉండాలి. ఇప్పుడైతే మానసికంగా ధృఢంగా ఉన్నాను. నాకైతే జీవితానికి కచ్చితంగా తోడు అవసరమని నేను అనుకోవడంలేదు. నా మైండ్‌సెట్‌కి దగ్గరగా ఉండే వ్యక్తి దొరికితే అప్పుడు పెళ్లి గురించి ఆలోచిస్తా. ఒకవేళ అదే జరిగితే.. అందరికీ చెప్పే చేసుకుంటా' అని చెప్పింది మమతా మోహన్‌దాస్.



# అర్జునుడిగా కనిపిస్తాడా?

'కల్కి 2898' సినిమాలో అర్జునుడిగా విజయ్ దేవరకొండ కనిపించబోతున్నాడా? వాతావరణం అవుననే చెబుతున్నది. 'కల్కి' పురాణాలతో మిళితమైన ఫిక్షన్ సినిమా. ఆరువేల సంవత్సరాల క్రితం జరిగిన కురుక్షేత్ర సంగ్రామానికి అశ్వత్థామ వృత్తాంతానికి ఈ కథకు సంబంధం ఉందని ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలే చెబుతున్నాయి. వృద్ధుడైన ద్రోణసుతుడు అశ్వత్థామను చూపిస్తూనే, యువకుడైన అశ్వత్థామను కూడా టీజర్‌లో చూపించారు దర్శకుడు. కాబట్టి కచ్చితంగా ఆరు వేల సంవత్సరాల క్రితం ఏం జరిగిందో ఇందులో చూపించే అవకాశం ఉంది. అశ్వత్థామ వృత్తాంతంలో కృష్ణార్జునుల పాత్రలు చాలా కీలకం కాబట్టి అర్జునుడి పాత్రను విజయ్ దేవరకొండతో చేయించడం జరిగిందనేది ఫిల్మ్‌వర్గాల్లో వినిపిస్తున్న మాట. మరి 'కల్కి'గా కనిపించనున్న ప్రభాసే.. కృష్ణుడిగా కూడా కనిపిస్తారా? అనేది తెలియాల్సివుంది.

# బాలీవుడ్ నిర్మాణ సంస్థతో భారీ డీల్!





దేశవ్యాప్తంగా అత్యధిక డిమాండ్ ఉన్న హీరోల్లో ప్రభాస్ ఒకరు. 'బాహుబలి ఫ్రాంచైజీ', సలార్ సినిమాల తర్వాత ఆయన ఇమేజ్ ఆకాశమంత ఎత్తుకు చేరుకుంది. ఈ నెల 27న 'కల్కి 2898'గా రాబోతున్నారు ప్రభాస్. ప్రస్తుతం ఆ సినిమాకోసం దేశం మొత్తం ఎదురుచూస్తున్నది. అంతేకాదు, ఈ సినిమా తర్వాత కూడా ఆయనకు చాలా కమిట్‌మెంట్లున్నాయి. అయినా సరే.. 'టీ సిరీస్' యాజమాన్యం ఆయనకు భారీ మొత్తంలో అడ్వాన్స్ ఇచ్చేశారట.

ఫిల్మ్ వర్గాల్లో ప్రస్తుతం ఈ విషయంపైనే చర్చ నడుస్తున్నది. 'టీ సిరీస్' గతంలో ప్రభాస్‌తో 'ఆదిపురుష్' తీశారు. ఆ సినిమా దారుణమైన ఫ్లాప్‌ని మూటగట్టుకున్నా, ముందుగానే బిజినెస్ డీల్స్ క్లోజ్ చేసుకోవడంవల్ల 'టీ సిరీస్' వాళ్లు మాత్రం లాభాలతోనే బయటపడ్డారు. అందుకే, ఈ సారి ప్రభాస్‌తో సరైన సినిమా చేయాలనే కసితో ఉన్నారట టీ సిరీస్ యాజమాన్యం.

ప్రభాస్‌కోసం 'వార్' దర్శకుడు సిద్దార్థ్ ఆనంద్ ఓ కథ కూడా రెడీ చేశారు. ప్రభాస్ ఓకే అంటే, షూట్‌కి వెళ్లిపోడానికి రెడీగా ఉన్నారట టీ సిరీస్. కానీ ప్రభాస్‌కు ఓకే అనే పరిస్థితి లేదు. ఆయన 'కల్కి 2898' విడుదలకు సిద్ధమైంది. మారుతీ దర్శకత్వంలో ప్రభాస్ చేస్తున్న 'రాజాసాబ్' సినిమా కూడా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. మరోవైపు 'సలార్ శౌర్యాంగపర్వం' షూటింగ్ మొదలైంది. ఇంకోవైపు అను రాఘవపూడి చెప్పిన పీరియాడిక్ కథకు కూడా ప్రభాస్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు. ఇవన్నీ పూర్తవ్వాలంటే రెండేళ్లు పట్టడం ఖాయం. దీన్ని బట్టి చూస్తే టీ సిరీస్ వాళ్లు ఓ రెండేళ్ల ఆగక తప్పదు.